# నలుపు


భైరవయ్య

క్రమ్యూనిటీహాలు ముందు కారాగింది. తొందర తొందరగా ఇద్దరు కారు దగ్గరకొచ్చి తలుపు తీశారు. చంద్రశేఖరం కారు దిగాడు. చేతులు జోడించి నమస్కారాన్ని గొణిగాడు.

"సిటీనుంచి ఇంత దూరం శ్రమ అనుకోకుండా వచ్చారు" అన్నాడా ఇద్దరిలో ఒకాయన. అతను మూర్తి హెచ్.ఎమ్.టి. కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంటు.

"భలేవారే శ్రమేమున్నదండీ" అన్నాడు చంద్రశేఖరం.

"చాలా బిజీగా వున్నారు మూర్తీ నే వెళ్ళేసరికి. సాయంత్రానికల్లా జ్యోతికి బొమ్మలు వేసివ్వాలట. ఆ జ్యోతి తాలూకు మనిషి కూడా అక్కడే వున్నారు" అన్నాడు చంద్రశేఖర్‌తో కారు దిగిన వ్యక్తి. అతడు రాధాక్రిష్ణ- ఆ ఆర్గ




నైజేషన్ సెక్రెటరీ.

"సారీ సర్. మీకు చాలా శ్రమిస్తున్నాము." అన్నాడు మూర్తి.

"మీరు మరీ ఇబ్బందిపెట్టేస్తున్నారు వన్ను." అన్నాడు చంద్రశేఖరం.

రెండు క్షణాలు ఇబ్బందిగా నవ్వులు తొణికాయి.

హెచ్. ఎమ్. టి. కల్చరల్ ఆర్గనైజేషన్ చిన్న పిల్లలకి చిత్రకళలో పోటీలు నిర్వహించింది. దానికి న్యాయనిర్ణేతగా చంద్రశేఖరాన్ని పిలవడం జరిగింది.

చంద్రశేఖరం భాగ్యనగరంలో పేరున్న ఆర్టిస్టు. మంచి పెయింటర్.

చంద్రశేఖరం. మూర్తీ. రాధాక్రిష్ణ ఇంకో ఇద్దరూ కలిసి హాలులోకి ప్రవేశించాడు.

హాలులో ఒకవేపు ఎక్కువగా పిల్లలున్నారు. మూడేళ్ళ నుంచి, పన్నెండేళ్ళ వరకూ – వాళ్ళ తల్లిదండ్రుల అభిరుచినీ. ఆఫీసులోనూ సాంఘికంగానూ వాళ్ళకున్న హోదానీ ప్రతిబింబిస్తూ— పిల్లలున్నారు.

మరొక వేపు రెండు వరుసల్లో పిల్లలు చిత్రించిన చిత్రాలున్నాయి.

ఆ వాతావరణంలో— పెద్దవాళ్ళు చాలా ఎబ్బెట్టుగా, ఎగ్జిక్యూటివ్‌లా వున్నారు.

చంద్రశేఖరాన్ని అక్కడున్న ఆఫీసర్లకీ, పెద్దలకీ పరిచయం చేశాడు మూర్తి.

పరిచయాలవీపూర్తయ్యాకఒక్కొక్క చిత్రాన్నే. పరిశీలించడం ప్రారంభించాడు చంద్రశేఖరం.

రకరకాల రంగుల మిశ్రమం—

ఎన్నో రేఖలు. వింత పరిమాణాల్లో విచిత్రగతుల్లో వాటి ప్రయాణం—

వాతావరణం చేత. నాగరికతచేత, బాధ్యతలచేత ఇంకా కలుషితం కానటువంటి వాళ్ళ అనూహ్యమైన ఊహాలోకాల్లోంచి స్వచ్ఛంగా. సున్నితంగా. ప్రస్ఫుటంగా బయటికి దూసుకొచ్చిన విభిన్న భావాల ప్రకటన—

చంద్రశేఖరం ముందు నిలబడినట్టుగా వుంది.

"వీళ్ళ ఆలోచనలు. ఊహాశక్తి ఎంత నిర్మలంగా. ఎంత స్వేచ్ఛగా వున్నాయి. వీళ్ళ కెవరు నేర్పారీ రంగుల వలలు అల్లడం. వీళ్ళ లోకాల్ని నేను చేరుకో



గలనా ఈ చిన్నారి కళ్ళకి కనిపిస్తున్న సుదూరమైన ఊహా ప్రపంచపు అంచు లెక్కడ. నిగూఢమైన వీళ్ళ హృదయపు లోతుల్లోంచి ఉబుకుతున్న భావావేశ వేగానికి అవధులెక్కడ. అవి నేనందుకోగలనా? ఎంచి తూచగలిగే సామర్ధ్యం నాకుందా" అని అనుకున్నాడు చంద్రశేఖరం.

ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క కథ

చెపుతున్నట్టు, వక్రంగా వున్నా, వీడుగూ పొట్టి వున్నా ప్రతి రేఖా ఏదోరహస్యాన్ని చెపుతున్నట్టు గుండె తలుపుల్ని సున్నితంగా తడుతున్నట్టు వుంది చంద్రశేఖరానికి.

తనూ- తన సమస్యలూ, సందేహాలూ భయాలు, తెచ్చిపెట్టుకున్న మర్యాదలూ. హోదా, తన చుట్టూ గీసుకున్న గీతలూ- ఎంత పేలవమో, ఎంత నిరాధారమో అని పించిందిఆ విచిత్ర రంగుల ప్రపంచంలో తిరుగుతున్న చంద్రశేఖరానికి.

"జ్ఞానం రాలేదు- లోకం తెలియదు- ఇంకా పసివాళ్ళు" అని మనం అనుకునే ఈ పసిడి మనసులు సృష్టించిన రంగు రంగుల రేఖలు- నవ్వునీ, విస్మయాన్నీ, ఆలోచనల్నీ, బాధనీ- ఎన్ని అనుభూతుల్ని కలిగిస్తున్నాయి.

ఒక చోట ప్రకృతి- అస్తమిస్తున్న సూర్యుడు, ఏమా రంగుల అల్లిక..... నలుపు, తెలుపు, పసుపు మధ్య అక్కట్టుకుంటున్న నారింజ రంగు;

మరో చోట- మనిషి తల మిగతా భాగమంతా రాకెట్టులా;

ఇంకో చోట- రకరకాల రంగుల పెను కలయిక.... హద్దుల్లేని ఆటవిక సౌందర్యంలా;

ఇలా రకరకాలు—

ఏవని ఎంచడం.... ఏది బహుమతికి అర్హమైనదనడం—

జలపాత సంగీతాన్ని సరిగమల్లో బిగించాలనుకోవడం, వేటాడుతున్న పెద్ద పులికి యుద్ధతంత్రాన్ని నేర్పాలనుకోవడం- ఎలా సాహసమో.

ఈ చిత్రాల విలువల్ని ఎంచాలనుకోవడం కూడా అంతే సాహసమవుతుందని పించింది చంద్రశేఖరానికి.

వాటి విలువల్ని నిర్ణయించాలంటే ముందు తను ఆ మానసిక స్థాయికి ఎదగగలగాలి అనుకున్నాడు.

అవతల వేపు కూర్చున్న పిల్లలు తమ కళా సృష్టికేసి,చంద్రశేఖరం కేసి చూస్తున్నారు.ఆ ముఖాల్లో—ఆత్రుత,సంతృప్తి, గర్వం— వాళ్ళుగీసిన చిత్రాల్లాగే వివిధ భావాల ప్రకటన.

నడుస్తున్న చంద్రశేఖరం ఒక్కసారి బిక్కచచ్చినట్టు ఆగిపోయాడు.

ఎదురుగా వున్న చిత్రంలో వున్నది ఒకే ఒక్క రంగు.

కాని—ఆ రంగు ఎన్ని రంగుల్నో తనలో ఇముడ్చుకున్నట్టు.... ఎన్నో యుగాల దీర్ఘ తపస్సుని తనలో దాచుకున్నట్టు.... అనాది వేదననీ,అనంత భావావేశాన్ని తన లోనే కుదించుకున్నట్టు—

ఒకే ఒక్క రంగు.... నలుపు.

ఆ నలుపు నలుపులా లేదు.అనంతకోటి నక్షత్రాల కాంతిని అరిగించుకున్నట్టు మెరుస్తోంది.

ఆ నలుపు రంగులా లేదు. అత్యంత వేగంతో దూకుతున్న భావోద్వేగంలా వుంది.

ఆ నలుపు భావంలా లేదు. ఎన్నో పరిశోధనలకందని నిగూఢ చారిత్రక సత్యాన్ని ప్రస్ఫుటిస్తున్నట్టుగా వుంది.

ఆ నలుపు—

శిధిలమైన మొండి గోడల కోట పలుకుతున్న రహస్యంలా వుంది.

జీవితాన్ని మధించిన వేదాంతి చిరునవ్వులా, భయంకర శాంతమూర్తిలా వుంది.

జీవితంలా వుంది.

ఆ నలుపు—

మెదడు పొరల మధ్య చీకటిని చీలుస్తోంది.

మనస్సు రెక్కల్నిపట్టి గుండె వాకిళ్ళని తెరుస్తోంది.

కళ్ళ అగాధాల్లో దాచుకున్నముత్యాల్ని వెలికి తీస్తోంది.

ఆ చిత్రానికిపెట్టినపేరు చంద్రశేఖరం నరనరాల్ని కుదిపింది.

"ఈ బొమ్మ వేసిందెవరండీ"అన్నాడు ఆ చిత్రపు హిప్నాటిక్ట్రాన్స్‌లోంచి తేరుకుని.

"కారుణ్యని.... టూల్ సెక్షన్ ఎ.ఇ.డాటర్" అన్నాడు పక్కనేవున్న రాధాకృష్ణ.

"ఒకసారి పిలుస్తారా."

"అలాగే" అని రాధాకృష్ణ వెళ్ళాడు.

"ఆ పాపకి ఎనిమిదేళ్ళండి. చాలా తెలివైనది. ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది. ఆ పాప ఫాదర్...." అని ఏదో చెప్పబోతున్న మూర్తిని ఆపాడు చంద్రశేఖరం.

రాధాకృష్ణతో వస్తున్న కారుణ్యని చూస్తున్నాడు.

తెల్లటి ఫ్రాకులో మెరుపులా వుంది. పెదాలు నవ్వుతున్నాయి. కళ్ళుమాత్రం ఆ చిత్రాన్నే చూస్తున్నాయి. అయస్కాంతానికి ఆకర్షింపబడే ఇనుపరజనులా ఆ పాప చూపులు ఆ నల్లరంగు మీదే కొట్లాడుతున్నాయి.

ఆ కళ్ళల్లోనూ అదే నలుపు. మనుషుల్ని చుట్టుముట్టే హిప్నాటిక్ నలుపు.

ఆ కళ్ళు నవ్వటం లేదు.

ఆ కళ్ళు కదలటం లేదు.

ఆ కళ్ళలో ఏదో అందీ అందని వేదన....

"నీ పేరేమిటి పాపా" అన్నాడు చంద్రశేఖరం.

"కారుణ్య."

"నీకు తెల్ల గౌనంటే ఇష్టమా?"

"పిన్ని వేసింది."

"పిన్నా?"

"అవును....పిన్ని....కావుంటుంది.... నల్లగా"

"నీకు నల్లరంగంటే ఇష్టమా?"

"ఊహూ."

"మరి."

"భయం."

"అయితే నల్లరంగేకావేం బొమ్మంతా?"

"అమ్మ లేదుగా"

ఆ మాటంటున్న కారుణ్య గొంతులో ఏ భావముందో చంద్రశేఖరానికి అంతుపట్టలేదు. చాలా ఫ్లాట్‌గా—ఎక్కడ్నించో ప్రవక్త పలుకుతున్నట్టుగా వుంది.

నలుపునీ, కన్నీళ్ళనీ మించిన అనంతమైన వేదన సుడిగుండంలా చంద్రశేఖరాన్ని చుట్టుకుంది.

అప్రయత్నంగా మోకాళ్ళ మీద కూర్చుని "పాపా" అని దగ్గరకు తీసుకున్నాడు—కళ్ళలో ముత్యాలు కదుల్తున్న చంద్రశేఖరం.

ఆ బొమ్మ పేరు.

"అమ్మ"

(తనకోసం రాయబడ్డ చంద్రికి)